క్లుప్తంగా

జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మార్చి 2,3,4వ తేదీల్లో మూడు రోజుల పాటు జాతర నిర్వహించ నున్నారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష మంగళవారం అమ్మవారి ఆలయాన్ని సందర్శించి, జాతర ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని దేవదాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట ఈఓ బి.శ్రీనివాసరావు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

చీపురుపల్లి: వనం–మనం కార్యక్రమంలో భాగంగా ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అధ్యాపకులతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. ఎస్ఎస్ఐ నాయకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా విద్యాలయాల వద్ద మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై పోరాటం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకి, జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, మండల కమిటీ ప్రతినిధులు సీహెచ్.రమణ, జగదీష్, నాని, మధు, శ్రీలత, సాయి పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె..

- నేడు మహాశివరాత్రి వేడుకలు
- ముస్తాబైన శైవక్షేత్రాలు
- పుణ్యగిరికి వేలాదిగా తరలిరానున్న భక్తులు



ధారగంగమ్మలోయలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన రెయిలింగ్



పుణ్యగిరి దేవాలయం



పుణ్యగిరిలో పూజలందుకుంటున్న ఉమాకోటిలింగేశ్వరుడు



పుణ్యగిరి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

శృంగవరపుకోట: నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు బుధవారం నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఎస్.కోట మండలంలోని ప్రసి ద్ధ పుణ్యగిరి ఉమాకోటిలింగేశ్వర ఆలయం, ధర్మవరం పంచాయతీ, సన్యాసయ్యపాలెంలోని సన్యాసేశ్వర ఆలయంతో పాటు ఎల్.కోట, వేపాడ, జామి, కొత్త వల స మండలాల్లోని ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయ శాఖ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పుణ్యగిరి దేవస్థానంలో విశిష్ట దర్శనం రూ.50, శీఘ్ర దర్శనం రూ.20, ఉచిత దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు, భక్తులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఆరు చలివేంద్రాలు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు అయిదు తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయం వద్ద రెండు జనరేటర్లు, 10వేల లడ్డూలు, 8 వేల పులి హోర ప్యాకెట్ల ప్రసాదం సిద్ధం చేస్తున్నారు. నాలుగు చోట్ల అడ్రసింగ్ సిస్టమ్స్, నిఘా కోసం 25 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. పుణ్యగిరి జాతరకు వచ్చే భక్తుల కోసం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి 10 ప్రత్యేక బస్సులు, సన్యాసయ్యపాలెంలోని సన్యాసేశ్వర ఆల యానికి 3 ప్రత్యేక బస్సు లను బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి గురువారం సాయంత్రం వరకు నడపనున్నారు. శివరాత్రి రోజు రాత్రి కూడా బస్సులు నడవనున్నాయి.

భక్తసిరి 'పుణ్య'గిరి

ఎస్.కోట పట్టణానికి కూతవేటు దూరంలో ఉంది పుణ్యగిరి. జాలువారే జలపాతాల సడి, మర్కట మూకల సందడి, పురాణాలతో ముడిపడి, ఉమాకోటిలింగేశ్వరుడు కొలువుదీరిన క్షేత్రం పుణ్యగిరి. విరాటరాజ్య రక్షకుడైన కీచకుడు కొలువుదీరిన శంగారపుకోట కాలక్రమంలో శృంగవరపుకోటగా మారింది. సైరంధ్రి పేరుతో ఉన్న ద్రౌపదిని బలాత్కరించబోయి భీముని చేతిలో నిహతుడైన కీచకునికి ముక్తి ప్రసాదించమని సోదరి సుదేష్ణ కోరిక మేరకు ధర్మరాజు శివుని ప్రార్థించగా,శివుని శిరోపాయల నుంచి వెలువడ్డ ధార నేటికీ భూగర్భం లోంచి వస్తూ శివలింగాన్ని స్పృశిస్తూ వచ్చి పుట్టుధార, శివధారగా వాసికెక్కింది. కొండ శిలకు అంటిపెట్టుకుని భూమికి అధోముఖంగా ఉన్న లింగాల నుంచి నీటి బిందువులు పడుతుంటాయి. పూర్వం ఈనీరు అంతా ఒకే చోట పడేందుకు గొడుగులు కట్టడంతో దీన్ని గొడుగులధారగా పిలవనారంభించారు. కీచకుని అస్థికల నిమజ్జనం ఇక్కడ చేశారని, ఇక్కడ అస్థినిమజ్జనం చేస్తే చనిపోయిన వారికి సద్గతులు కలుగుతాయన్న నమ్మకం ప్రబలంగా ఉంది. పుణ్యగిరిలో ఉమాకోటిలింగేశ్వరుడు, పుట్టుధార, పార్వతీధార, కోటిలింగాల రేవు, త్రినాథగుహ, ధారగంగమ్మలోయ, బూరెలగుట్ట వంటి స్థలాలు ఉన్నాయి. శివరాత్రి వేళలో రెండురోజుల పాటూ జరిగే జాతరలో పుణ్యగిరికి పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తుతారు.

సంతాన సిద్ధి కోసం..

సంతానసిద్ధి కల్గించే గొప్ప క్షేత్రంగా ఎస్.కోట మండలంలోని ధర్మవరం పంచాయతీ పరిధి సన్యాసయ్య పాలెంలోని సన్యాసేశ్వరస్వామి ఆలయానికి పేరు. 15వ శతాబ్దంలో ఒక సన్యాసి కాశీయాత్రకు వెళ్తూ ధర్మవరంలో మజిలీ చేయగా, గ్రామస్తులు తమ పిల్లలను ఏదో శక్తి చంపేస్తోందని మొరపెట్టుకోగా ఆయన తన మంత్రబలంతో శక్తిని బంధించి, ఆలయంలో సంతానగోపాలయంత్రం, బైరవ యంత్రాలను ప్రతిష్ఠించారని స్థలపురాణంలో ఉంది. నాటి నుంచి సంతానం లేనివారు సన్యాసేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించి, పూజలు చేస్తే సంతానవంతులు అవుతారని ప్రగాఢ విశ్వాసం. శివరాత్రి వేళ పుణ్యగిరి జాతరకు వచ్చిన భక్తులు సన్యాసేశ్వరున్ని దర్శిస్తారు.



సన్యాసేశ్వర స్వామి ఆలయం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థినులకు మెమొంటోలు అందజేస్తున్న అరుణ్‌కుమార్

గంట్యాడ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్‌లైన్ ప్రతినిధి చప్ప అరుణ్‌కుమార్ అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్ర మంలో భాగంగా మదనాపురం మోడల్ స్కూల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు అందజేశారు. ఈసందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్‌లైన్ ట్రోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాలను నిలిపివేస్తారని చెప్పారు. విద్యార్థినులు గుడ్ టచ్ బ్యాడ్‌టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, చైల్డ్‌లైన్ ప్రతినిధి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చీపురుపల్లి/ చీపురుపల్లి రూరల్(గరివిడి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ) పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులు త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్(ఏపీసీ) డాక్టర్ ఏ.రామారావు అన్నారు. చీపురుపల్లి, గరివిడి కేజీబీవీలను మంగళవారం ఆయన సందర్శించారు. స్టోర్ రూమ్‌ల్లో స్టాకును పరిశీలించి, రిజిస్టర్లను తనిఖీ చేశారు.అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయినులతో మాట్లాడారు. కొద్ది రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నందున సమయం వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకుని, ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని విద్యార్థినులకు సూచించారు. ప్రణాళికాబద్ధంగా విద్యార్థినులతో చదివించి వారిని పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయినులను ఆదేశించారు. ఆయన వెంట కేజీబీవీల ఎస్ఓలు ఎల్.హైమావతి, ధనలక్ష్మి ఉన్నారు.



చీపురుపల్లి కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు

వాలీబాల్ ,షటిల్ కోర్టులు ప్రారంభం



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్

కొత్తవలస: కంటకాపల్లి ఉన్నత పాఠశాలలో ఆ గ్రామానికి సమీపంలో ఉన్న శారద మెటల్స్, ఎల్లాయిస్ కర్మాగారం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా వాలీబాల్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేశారు. వీటిని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ శారద కర్మాగార యాజమాన్యం గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిషత్ ఉంటుందన్నారు. హెచ్ఎం అరుణకుమార్, కర్మాగారం ప్రతినిధులు సన్యాసిరావు,సూర్య భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయం కోసమే లీగల్ ఎయిడ్ క్లినిక్

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజేష్

చీపురుపల్లి: జైళ్లలో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్ చెప్పారు. పట్టణంలోని సబ్ జైల్‌ను మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ జైల్‌లో కొనసాగుతున్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేసి, లీగల్ ఎయిడ్ క్లినిక్ విధులను పర్యవేక్షించారు. అనంతరం ముద్దాయిలతో మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల విధులను వివరించారు. జైళ్లలో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కర్తవ్యమని చెప్పారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు న్యాయవాదులు లేని పరిస్థితులు ఉండకూడదన్నారు. అనంతరం వంట గది, భోజనశాలను పరిశీలించారు.



సబ్ జైల్‌లో ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేష్

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



చీపురుపల్లి: కేజీబీవీలో విజయగౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. గత కొన్నిరోజులుగా అభ్యర్థులతో పాటు వారికి మద్దతుగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు హోరాహోరీగా ప్రచారం చేశారు. ఆఖరి రోజు చీపురుపల్లి, మెరకముడిదాం, వేపాడ మండలాల్లోని ప్రభు త్వ పాఠశాలలు, కళాశాలల్లో పీఆర్‌టీయూ, యూటీఎఫ్,సీఐటీయూ నాయకులు ప్రచారం చేశారు. పీఆర్‌టీయూ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు, ఆసంఘ నాయకులు ఉపాధ్యాయులను అభ్యర్థించారు. పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జే.ఏ.వి.ఆర్.కె.ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, తదితరులు ఉపాధ్యాయులను కోరారు.

– మెరకముడిదాం/చీపురుపల్లి/వేపాడ



మెరకముడిదాం: సోమలింగాపురం కళాశాలలో శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంబాబు



వేపాడ: నీలకంఠరాజపురంలో విజయగౌరికి మద్దతుగా ప్రచారం చేస్తున్న యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

వేపాడ: బొద్దాం ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల ఫేర్‌వెల్‌డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు నృత్యాలు, నాటికలు, మిమిక్రీ, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. హెచ్ఎం వి.భాస్కరరావు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న పదోతరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

రెండు లారీలు ఢీ



ముందు ఉన్న లారీని ఢీకొట్టిన కర్రల లోడ్‌తో ఉన్న లారీ

గజపతినగరం: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ రహదారిపై మంగళవారం రెండు లారీలు ఢీకొన్నాయి. కర్రల లోడ్‌తో వెళుతున్న ఓలారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.ట్రాఫిక్‌కు కొంత సమయం అంతరాయం కలగగా, పోలీసులు వచ్చి ఆ లారీలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బాబాను దర్శించుకుంటున్న భక్తులు

లక్కవరపుకోట: మండలంలోని గోల్డుస్టార్ జంక్షన్ సమీపంలోని షిర్డీసాయినాథుని ఆలయ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. జమ్మాదేవిపేట సర్పంచ్ బెహరా సత్యవతి,ఆలయ నిర్వాహకులు బెహరా వరహాల బాబు, సంతోష్‌కు మార్,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతుల ప్రదానం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

గజపతినగరం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులకు ఇటీవల ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించారు. ఈపరీక్షల్లో 500 మార్కులు దాటిన తొమ్మిది మంది విద్యార్థినులకు ఆ పాఠశాలలో ఎంఈఓ–2 సాయి చక్రధర్ మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రీఫైనల్ ఎగ్జామ్స్ మాదిరిగానే పబ్లిక్ పరీక్షలు ఉంటాయని, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థినులకు సూచించారు. హెచ్ఎం చిప్పాడ రమేష్ కుమార్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్రగాయాలు

లక్కవరపుకోట: మండలంలోని తలారి గ్రామానికి చెందిన జి.పెదప్పన్న మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. తన ఇంటి సమీపంలో గల సిమెంట్ రేకుల షెడ్‌ను తొలగించి ఇనుప రేకులు వేసే పని చేస్తుండగా ఆదమరిచి షెడ్‌పైనుంచి వెళ్లే 11కేవీ విద్యుత్ లైన్‌ను తాకడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే అక్కడే గల బంధువులు, స్థానికులు 108 వాహనంలో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైనవైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌లో చేర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.



విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాల పాలైన పెదప్పన్న

నువ్వు పంట సాగుపై అవగాహన

గజపతినగరం రూరల్: మండలంలోని వేమలి గ్రామంలో ఏఓ ధనలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నువ్వు పంట సాగుపై రైతులకు అవగాహనకల్పించారు.వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం అధికారి గోవిందమ్మ మాట్లాడుతూ వేసవిలో సాగు చేసే నువ్వు పంటకు నీటితడులు సకాలంలో అందిస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఏఓ మాట్లాడుతూ రైతులు భూ ఆధార్ కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. సర్పంచ్ మోహన్ రావు, వ్యవసాయ సహాయకులు లోకేష్, తదితరులు పాల్గొన్నారు.